లేఖ :

# పాలస్తీనా ప్రజా పోరాటం - కొన్ని సమస్యలు

అయ్యా, శ్రీ బాలగోపాల్ పాలస్తీనా ప్రజాపోరాటంపై రాసినవ్యాసం అనేక వివరాలతో పాఠకుడ్ని ముంచెత్తుతుంది. అలాగే పాలస్తీనా ప్రజలకడగళ్ళను, ఇజ్రాయిల్ దురాక్రమణతత్వాన్ని చక్కగా చిత్రించి పాఠకుల్లో పాలస్తీనా ప్రవాసులపట్ల సానుభూతి రేకెత్తిస్తుంది. అయితే అందులో కొన్ని ముఖ్యమైన లోపాలు వున్నాయి. బహుశా అవి బాలగోపాల్‌గారు ఉద్దేశ్యపూర్వకంగా చేసినవే అనిపిస్తుందికూడ.

మొదటిది : ఇజ్రాయిల్ రాజ్యం ఏర్పడేంతవరకు సాగినచరిత్రను చిత్రీకరించడంలో అరబ్బులదే అంతాకరెక్టు, యూదులది అంతాతప్పేనన్నట్లు వర్ణించారు. ఇది సమంజసంకాదు. తమసంఖ్యాబలం చూచుకుని విర్రవీగుతూ ప్రపంచప్రజల అభిమతాల్ని (యూదులకు ఒక నివాసభూమి కల్పించాలనే) కాలరాసి, అప్పుడేఏర్పడిన ఇజ్రాయిల్‌పై యుద్ధంప్రకటించడంద్వారా అరబ్బులే తమవినాశాన్ని తామే కొని తెచ్చుకున్నారు.

రెండు : ఐక్యరాజ్యసమితిలో ఇజ్రాయిల్‌ను ఏర్పరచాలని, అందుకని పాలస్తీనాను విభజించాలనే తీర్మానాన్ని అమెరికాయేగాక అప్పటి స్టాలిన్ నాయకత్వంలోని రష్యాకూడ బలపరచింది. ఆ తర్వాత స్టాలిన్ నాయకత్వంలోను, స్టాలిన్ అనంతర కాలంలోనుకూడ రష్యా ఇజ్రాయిల్‌తో బహుకాలం దౌత్యసంబంధాలు పెట్టుకున్నది. అంటే ఇజ్రాయిల్ అస్తిత్వాన్ని గుర్తించిందన్నమాట. తనదృష్టిలో స్టాలిన్‌కు ఎలాంటి మచ్చరాకూడదనుకున్నాడేమో, బాలగోపాల్ ఈ అంశాన్ని దాటవేసారు.

మూడు : 1948 తర్వాత పాలస్తీనాలోని అనేకప్రాంతాలు అరబ్బురాజ్యాల (జోర్డాన్, సిరియా, ఈజిప్టు) చేతుల్లోవున్నా అవిఎన్నడూ ఆ ప్రాంతాల్లోనైనా పాలస్తీనా ప్రజలకు ఒక రాజ్యంఏర్పరచాలని ప్రయత్నించలేదు.

నాలుగు : ఇజ్రాయిల్ తరపున యూదు మతోన్మాదం ఎలావున్నదో, అరబ్బుల తరపున (పాలస్తీనా ప్రగతివాదుల్ని మినహాయిస్తే) ముస్లిం మతోన్మాదంకూడ అంతకుతక్కువేమీలేదు.

ఐదు : పాలస్తీనాలో వివిధ గెరిల్లాసంస్థల పుట్టుక, చరిత్రలగురించి వివరంగా చర్చించనేలేదు. (అయితే ఇది బాలగోపాల్‌గారి ఉద్దేశ్యపూర్వక లోపంకాదు.)

ఆరు : అరబ్బుప్రజలకు, పాలస్తీనాప్రజలకు సోవియట్ యూనియన్‌చేసిన చేస్తున్నసహాయం నాటికీ, నేటికీ ఎంతోఘనమైనదే. అందులో రష్యా భౌగోళిక

ప్రయోజనాలు ఇమిడివుండవచ్చుగాక (ఏదేశం పూర్తిగా నిస్వార్థసహాయం చేస్తున్నది?) అయినా- నిజమైన సానుభూతి, సంవేదనలుకూడ యిమిడివున్నాయి. ఇప్పటి సంక్షోభం లో 'రష్యా డాంబికాలు పలుకుతున్నదేగాని ఏమీ చేయడంలేదు.' అని వ్యాఖ్యానించడం రాజకీయ, భౌగోళిక వాస్తవాలతో నిమిత్తంలేకుండా కేవల పెటీబూర్జువా ఆవేశంతో నోరుజారడమే. అసలు సోవియట్-సిరియాలకు సంధివున్నది నిజమే. మరి సిరియావాళ్ళు అర్థించకుండా సోవియెట్ ఎలా ప్రత్యక్షసహాయం చేయగలదు? ఇక సిరియావాళ్ళు లోలోన (పాలస్తీనా గెరిల్లాలు నాశనమవుతూంటే) సంతోషిస్తున్నారాయె. వాళ్ళెందుకు ఇజ్రాయిల్‌తో యుద్ధం చేయబూనుకుంటారు? లెబనాన్‌లో సిరియాసేనలు యుద్ధంచేసాయంటే కేవలం ఆత్మరక్షణ పరిధివరకే, అదీ మెలకువగా సురక్షితస్థానాలకు జారుకున్నారుకూడ. మన ఇండియావాళ్ళు PLOకు వైద్యసహాయం మందులూగట్రా పంపితే అవన్నీ, బీరుట్‌కు పంపకుండా సిరియా ప్రభుత్వం ద్వేషంతో ఆపివేసిందని మీకుతెలుసా? అలాగే రష్యాసహాయానికి, బ్రెజ్నెవ్ సంఘీభావానికి ధన్యవాదాలుతెలుపుతూ అరాఫత్ చేసిన ప్రకటన గమనించారా?

ఏడు: ప్రపంచ విప్లవకేంద్రం చైనామాటేమిటి? ఎక్కడా ఎవరినీపల్లెత్తు మాట అన్నట్లు కనిపించదేం? రష్యాపై విరుచుకుపడ్డఆగ్రహం, చైనావిషయంలో జావకారిపోయిందేం?

ఎనిమిది: అమెరికా హేయమైన పాత్రగురించి, అరబ్బుదేశాలు అమెరికాతో కుమ్మక్కైన తీరుగురించి ఇంకా బాగావివరించాల్సింది. సరే ఇక పరిష్కారంసంగతి ఆలోచిద్దాం. ఇజ్రాయిల్ తన 'భద్రమైన సరిహద్దులకు' వెనక్కుమళ్ళాలని, ఆ 'భద్రమైన సరిహద్దు'లేవో స్పష్టంగా నిర్వచించాలనేది ఒకవైపుఉంటే, మరోవైపున పాలస్తీనా అరబ్బులుకూడ ఇజ్రాయిల్ అస్తిత్వాన్ని గుర్తించాలి. తమకు ముఖ్యశత్రువు ఇంటిలోనే (అరబ్బు అభివృద్ధి నిరోధకుల్లో) వున్నాడని పాలస్తీనాప్రజలు గ్రహించాలి (బహుశా ఈపాటికి గ్రహించేవుంటారు). యూదు దురహంకారులపట్ల ధర్మయుద్ధం కొనసాగిస్తూనే, వివిధఅరబ్బుదేశాల్లో నియంతృత్వాలను, రాచరికాలను కూలద్రోయడానికి వారూ, అరబ్బు సామాన్యప్రజలు ప్రయత్నించాలి, ఆ ప్రయత్నాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రగతివాదులంతా మద్దతునివ్వాలి. మనం (ఇండియా) కూడ, ఇజ్రాయిల్‌తో దౌత్యసంబంధాలు నెలకొల్పుకొని, ఒకవైపున పాలస్తీనా ప్రజాపోరాటాన్ని సమర్థిస్తూనే, మరోవైపున ఇజ్రాయిల్‌పై దౌత్యపరంగా ప్రభావం కలగజేసేందుకుకూడ ప్రయత్నించాలి. లేదా కనీసం దౌత్యపరంగా తొలిసంబంధాలైనా ప్రారంభించాలి, పాలస్తీనా ప్రజలకు ఒకరాజ్యం ఏర్పడాలనేదిమాత్రం నిర్వివాదమే. అయితే అది ఇజ్రాయిల్ అస్తిత్వాన్ని నిరాకరించడంద్వారా మాత్రం సాధ్యంకాదు; సవ్యమూకాదు.

— మల్లిక్ బాబు

**జవాబు :**

మల్లిక్‌బాబు ప్రస్తావించిన ఎనిమిదిపాయింట్లలో నాకు సమాధానం చెప్పవలసిన అవసరమున్నట్టు తోచినవాటికి సమాధానంచెప్తాను.

1. ఇదిచాలా అన్యాయమయిన ఆరోపణ. తమకంటే ధనవంతులు, బలవంతులు, తమదేశాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకొని, తమభూముల్ని కొనుక్కొని, తమ భూములనుండి తమనుగెంటేసి, జాతిదురహంకారాన్ని ప్రాతిపదికగాగల పరాయి రాజ్యాన్ని తమదేశంలో ఏర్పరచుకుంటే తామతిరగబడడం 'విద్రోహిగుడు' అయితే ఈ ప్రపంచ చరిత్రలో న్యాయమయిన పోరాటాలు ఏవయినాఉన్నాయా ?

2. ఇజ్రాయిల్ ఏర్పాటును స్టాలిన్ సమర్థించినమాట వాస్తవమే. ఒక్క స్టాలినేకాదు, యూరప్‌లోని అభ్యుదయశక్తులన్నీగూడ సమర్థించాయి. దీని వెనకున్న వాస్తవాన్ని గుర్తుంచుకుంటే ఆ సమర్థన ఆశ్చర్యంకలిగించదు. యూరప్‌లో చాలా బలంగావున్న యూదువ్యతిరేకతను ఎదుర్కొని దానిమీద పోరాటంజరిపినది అక్కడి కమ్యూనిస్టులు, ఇతర సోషలిస్టులు. యూదువ్యతిరేకతను సిద్ధాంతంగా గల నాజిజాన్ని చివరికంటా రాజీలేకుండా వ్యతిరేకించి పోరాడింది వీళ్ళే. ఇవ్వాళ ఫ్రాన్సులోనూ ఇటలీలోను కమ్యూనిస్టుపార్టీలకు పార్లమెంటరీ రంగంలో కొంత బలముందంటే దానికి కారణం అనాడు నాజిజానికీ ఫాసిజానికీ (వాటితోబాటు యూదువ్యతిరేకతకూ) వ్యతిరేకంగా ఆయాదేశాల్లో జరిగిన ప్రతిఘటన (resistance) పోరాటంలో కమ్యూనిస్టులు ముందుండడమే. కాబట్టే, యూదువ్యతిరేక నాజీఉన్మాదానికి తట్టుకోలేక యూదులు యూరప్‌వదిలి పాలస్తీనా పారిపోవడాన్ని ఈ అభ్యుదయ శక్తులన్నీ సమర్థించాయి. అనాడు స్పష్టంగా వీళ్ళకు అర్థంగాని విషయమేమిటంటే, యూదులకు అన్యాయం జరిగింది యూరప్‌లోకాగా దానికి పాలస్తీనా అరబ్బులు పరిహారం చెల్లించాల్సిరావడం, రెండవది, జియోనిజం ఆనాటికే సామ్రాజ్యవాదపు ఏజెంటు కావడం. ఈ విషయాలను స్పష్టంగా గుర్తించిన నాటినుండీ అభ్యుదయశక్తులన్నీ జియోనిజాన్ని వ్యతిరేకిస్తూ వచ్చాయి.

3. సిరియా ఈజిప్టులచేతిలో పాలస్తీనాలోని ముఖ్యప్రాంతాలు ఎన్నడూలేవు. (అసలు ఏప్రాంతాలయినా వున్నాయా అని నాకు అనుమానం) జోర్డాన్ చేతిలోమాత్రం కొంతకాలం జోర్డాన్ నదీపశ్చిమతీరం (పత్రికలలో West Bank అనే పేరుతో వ్యవహరించబడేది) వుండేది. దాన్నిగూడ కొద్ది కొద్దిగా ఇజ్రాయిల్ ఆక్రమిస్తూ

వస్తోంది. ఆ ఆక్రమణ పెరుగుదల ఇప్పటి యుద్ధపు ముఖ్యపర్యవసానాలలో ఒకటి. అయినా West Bankలో పాలస్తీనా ప్రజలకు నివాసం ఏర్పరచడాన్ని జోర్డాన్ కంటే పాలస్తీనా ప్రజలే ఎక్కువగా తిరస్కరిస్తున్నారు. ఇంతవరకూ ఈ మధ్యకాలంలో అవైఖరిమారే సూచనలు కనిపిస్తున్నాయి. వాళ్ల ఒప్పుకుంటే జోర్డాన్‌చేత అమెరికా బలవంతంగా ఒప్పిస్తుందనడంలో సందేహంలేదు. ఎందుకంటే ఆ పరిష్కారం ఇజ్రాయిల్‌కు కావలసిన 'భద్రత'నిస్తుంది.

6 సోవియట్ రష్యా పాలస్తీనా ప్రజలకు చేసిన సహాయం ఎంతఘనమయినదో మల్లిక్‌బాబు వివరించివుంటే బాగుండేది. ఘనమయినది కాదనడం 'రాజకీయ, భౌగోళిక వాస్తవాలతో' నిమిత్తం లేకుండ ఆవేశపడడం అన్నారు. బూర్జువా పత్రికా పరిభాషలో 'రాజకీయ భౌగోళిక వాస్తవాలు' అన్నది జాతీయస్వార్థానికి పర్యాయ పదం. ఆ అర్థమే మల్లిక్‌బాబు ఉద్దేశ్యమయితే నాకు అభ్యంతరం లేదు. నేను చెప్పదల్చుకున్నదీ అదే. సొవియట్-సిరియా ఒప్పందం ఉన్నది నిజమేగాని 'సిరియా అర్థించకుండ సోవియట్ రష్యా ఎట్లా ప్రత్యక్షసహాయం చేయగలదు?' అని ప్రశ్నించడం అపారమయిన అమాయకత్వమే కావాలి. 1968 లో జెకొస్లోవేకియా నుండి 1980 లో అఫ్ఘానిస్తాన్ వరకు ఒకళ్ల అర్థిస్తేనే 'ప్రత్యక్షసహాయం' చేసిందా సోవియట్ రష్యా?

7 చైనా 'ప్రపంచవిప్లవ కేంద్రం' అవునా కాదా అన్న చర్చ ఇక్కడ అప్రస్తుతం. అయినాకాకున్నా చైనా ఒకళ్ళకు చేయగల సాయంతక్కువ. చైనా రష్యా లాగా ప్రపంచ అగ్రరాజ్యాలలో ఒకటికాదు- పేదదేశాలలో ఒకటి. ఐక్యరాజ్య సమితిలో చేయగల మాటసహాయం చేస్తూనేవుంది.

మిగిలింది పరిష్కారం. అందులో ఒక అవగాహన, రెండుసలహాలువున్నాయి. పాలస్తీనా ప్రజల ప్రధానశత్రువు ఇంటనే వున్నాడని నేననుకోవడంలేదు. వాళ్ళ ప్రధానశత్రువు జియొనిజమే ననుకుంటున్నాను. రెండు సలహాలలో ఒకటి పాలస్తీనా ప్రజలకు, రెండవది భారత్‌సర్కార్‌కు ఇచ్చారు. ఐక్యరాజ్యసమితి కాగితపు పరిష్కారాలనే ఎవ్వరూ గౌరవించడం లేదు. ఇక నేనూ మల్లిక్‌బాబూ ఒప్పుకున్నా ఈ పరిష్కారానికి అంతకంటే విలువ ఉంటుందని నేననుకోవడంలేదు. ఆ గొడవేదో పాలస్తీనా ప్రజలకే వదిలేయవచ్చుననుకుంటాను.

— కె. బాలగోపాల్